క్లుప్తంగా

వైభవంగా సామూహిక లలితా పారాయణం



పారాయణ చేస్తున్న మహిళలు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ కూడలి 52వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీ దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో మంగళవారం సామూహిక లలితా సహస్రనామ పారాయణం భక్తితో నిర్వహించారు. శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి పూజలు చేసిన అనంతరం లలిత పఠించారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు కుంకుమపూజ, సహస్ర నామార్చన, అభిషేకం జరిపించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. త్రివేణి గ్రామాభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు పి. గురురామరెడ్డి, కార్యదర్శి దొడ్డి జగన్, కుమార్ రాజా తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు బీమా నగదు అందిస్తున్న నాయకులు

గోపాలపట్నం: లక్ష్మీనగర్ వాసి దండి పుష్ప ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని మంగళవారం అందజేశారు. జీవీఎంసీ 92వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గేదెల మురళీకృష్ణ, గుణిశెట్టి శ్రీనివాసరావు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, బీమా తక్షణ సాయం రూ.10వేల నగదును వారికి అందించారు. మిగిలిన సొమ్ము బాధిత కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఊటపల్లి గోవిందు, ఆర్‌పీలు కృపారాణి, కన్వీనర్లు మీసాల రత్నం, పి.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి దళితుల సమస్యలు



మాట్లాడుతున్న మాటూరి శ్రీనివాసరావు

సింధియా: దళితుల సమస్యల పరిష్కార దిశగా దళిత సంఘాల నాయకులు కృషి చేయాలని దళిత రత్న మాటూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ ఏడుగుళ్ల సెంటర్ వద్ద ఏడు వార్డుల దళిత ఐక్య సంఘాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా నాయకులు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా దళితులకు సామాజిక భవనం నిర్మించే విధంగా పార్టీలకు అతీతంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సుదర్శనరావు, పెద్దాడ వెంకటరమణ, గవరరాజు, త్రినాథ్, వద్దాది రమణ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రహదారులు మెరుగు..
అభివృద్ధి పరుగు



ఐటీఐ జంక్షన్ బీటీ రహదారిలో ఏర్పాటు చేసిన జీబ్రా క్రాసింగ్, డివైడర్లు

- పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం
- స్మార్ట్ వార్డులే లక్ష్యంగా పనులు

కంచరపాలెం: బీఆర్‌టీఎస్ కంచరపాలెం రహదారి నుంచి ఎన్‌ఏడీ అటు జ్ఞానాపురం వరకు బీటీ రహదారులు సుందరీకరణకు నోచుకుంటున్నాయి. జోన్-5 పరిధిలో ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో నాణ్యమైన తారురోడ్ల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా, జ్ఞానాపురం ప్రాంతాల్లో రహదారులు మెరుగుపరుస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతుండడంతో వాహన చోదకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌టీఎస్ రహదారుల్లో రోడ్లు గుంతలు పడడం, ట్రాఫిక్ నిబంధనలకు రక్షణ చర్యలు లేకపోవడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకునేవి. రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం అభివృద్ధి పనులతో ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నారు. సుమారు రూ. 2.90 కోట్ల వ్యయంతో బీటీ రోడ్ల ఫుట్‌పాత్‌లు, డివైడర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, బారికేడ్లు తదితర అభివృద్ధి పనులు జరిగాయి. జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఇంజినీరింగ్ ఈఈలు ప్రసన్నరెడ్డి, శ్రీనివాసరావు, కంచరపాలెం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు నేతృత్వంలో సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. రహదారుల అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు కావడంతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.



కంచరపాలెంలో బీటీ రహదారి పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ ప్రసన్న రెడ్డి

చురుగ్గా నిర్మాణ పనులు

జ్ఞానాపురం నుంచి ఎన్‌ఏడీ కొత్తరోడ్డు వరకు బీఆర్‌టీఎస్ రహదారుల్లో తారురోడ్డు (బీటీ) రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బీటీ రోడ్ల నిర్మాణం జరిగిన చోట ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు, డిజిటల్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. పలు జంక్షన్ల వద్ద బారికేడ్లు, కారిడార్లు, ఫుట్‌పాత్‌లను రంగులతో సుందరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ. 1.20 కోట్లతో నిర్మించిన పనులు పూర్తికాగా మరో రూ. 2.90 కోట్ల పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. బీఆర్‌టీఎస్ రహదారుల్లో సమస్యలు పరిష్కారం కావడం, అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతుండడంతో వాహనాదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా అభివృద్ధి



మౌలిక వసతులు అభివృద్ధి జాడ ఏనాడు కనిపించలేదు. నాలుగేళ్ల క్రితం దివంగత సీఎం డాక్టర్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నమ్మి ఓటేశాం. మా నమ్మకాన్ని ఆయన నిలబెట్టారు. వార్డులన్నీ అభివృద్ధి చేస్తున్నారు. నిధులు పుష్కలంగా మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

-బి.శేషు, కంచరపాలెం

ప్రమాదాలు జరగకుండా చర్యలు



బీఆర్‌టీఎస్ రహదారుల్లో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు బీటీ రోడ్లు వేయడంతో ట్రాఫిక్ నియంత్రణ మరింత సులభతరంగా మారింది. దీంతో జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, డివైడర్లకు రంగులు వేయించాం. రహదారుల్లో ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టాం. నియమాలను పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలి.

-మళ్ల అప్పారావు సర్కిల్ ఇన్‌స్పెక్టర్, కంచరపాలెం ట్రాఫిక్ పీఎస్

స్మార్ట్ వార్డులుగా..



జోన్-5లో వార్డులను స్మార్ట్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం. ముందుగా రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ, ఎంపీ నిధులు మంజూరు కావడంతో వార్డు అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది.

-ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్ జోన్-5

పబ్లిక్ డిమాండ్

మురుగు తొలగించరూ..



హనుమాన్ సంజీవ్‌కాలనీ సేవా మార్గం వీధి కాలువలో నిలిచిపోయిన మురుగు

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు హనుమాన్ సంజీవ్‌కాలనీ సేవా మార్గం వీధి కాలువలో నెలల తరబడి మురుగు నిలిచిపోయింది. దీంతో ఈ కాలువకు ఆనుకుని ఉన్న నివాసితులు ముక్కు మూసుకుని ఇళ్లలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై వార్డు శానిటరీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

– వెంకటరమణ, హనుమాన్ సంజీవ్‌కాలనీ

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 89వ వార్డు యల్లపువానిపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి

గోపాలపట్నం: స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రణాళికలు రూపొందించి, పనులు ప్రారంభమయ్యేలా చూస్తున్నామన్నారు. జీవీఎంసీ 89వ వార్డు భీమిలి నియోజకవర్గం యల్లపువానిపాలెంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి, సంక్షేమ పథకాల వివరాలు ఉన్న పత్రాలను అందించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని స్థానికులు కోరగా, దీనిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, ఆళ్ల పైడిరాజు, అయితశెట్టి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'విస్టా' వర్క్‌షాపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు తదితరులు

అగనంపూడి: ఇంజినీర్స్ డే సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి రెండు రోజుల పాటు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సాంకేతిక సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సాంకేతిక సదస్సు విస్టా (విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) -2023 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని రెండు రోజుల పాటు 'సస్టెయినబుల్ టెక్నాలజీస్' పై ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అంశాలను రెండు రోజుల ప్రదర్శనలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని వివిధ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని సమాజానికి హితం చేకూర్చే ప్రదర్శనలు, లైవ్ ఎగ్జిబిషన్లు ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, కన్వీనర్ బోడే ప్రసాద్, కో-కన్వీనర్ పద్మాకర్, వివిధ విభాగాల డీన్లు, స్టూడెంట్స్ కన్వీనర్లు పాల్గొన్నారు.

'ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం కానివ్వం'



దీక్షలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 943వ రోజు, మంగళవారం సంస్థలోని వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రజల సంపదైన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనైనా విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నేడు 90వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

విశాఖ విద్య : జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం-1 సచివాలయం పరిధి లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో వార్డు అధ్యక్షుడు నమ్మి శ్రీను ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి విశాఖ డైయిరీ చైర్మన్, ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ హాజరు అవుతారని నమ్మి శ్రీను తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎన్ఎస్‌టీఎల్ సమీపంలోని ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర రూ.3 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులను ఆనంద్‌కుమార్ ప్రారంభించనున్నారని తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం 1.30 గంటలకు విమాననగర్ రజక కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల సభ్యులు, సచివాలయ క్లస్టర్ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొనాలని శ్రీను కోరారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు

సీతమ్మధార: నగరంలోని ప్రధాన జంక్షన్లలో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేశారు. మూడు రోజులుగా గాలి, వర్షానికి సీసీ కెమెరాలు పాడవడంతో జీవీఎంసీ టెక్నీషియన్లు కెమెరాలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేశారు. సత్యం జంక్షన్‌లో నాలుగు సిగ్నల్స్‌కు ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. హైవే పై పనిచేయని వాటిని సరి చేశారు.

నడకతో ఆరోగ్య సంరక్షణ



నడక వల్ల ప్రయోజనాలను వివరిస్తున్న శుభ

గాజువాక: ప్రతి రోజు నడవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. నడక ప్రయోజనాలపై స్థానిక అమరావతి పార్కులో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిరోజు కనీసం అరగంట నడవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయన్నారు. వాకర్స్‌తో తమ వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థను కూడా బలోపేతం చేస్తున్నామన్నారు. విశాఖ జిల్లాలో ఇప్పటివరకు 135 వాకర్స్ అసోసియేషన్లు ఉన్నాయని తెలిపారు. నడవండి.. నడిపించండి.. ఆరోగ్యమే మహాభాగ్యం అనేవి తమ సంస్థ ఆశయాలన్నారు. ప్రస్తుతం పది జిల్లాల్లో తమ సంస్థలు 1500 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ అమరావతి నగర్ కమిటీ ప్రతినిధులు ఎం.ఎల్.కె.ఎస్.అచ్యుతరావు, పైలా కృష్ణారావు, బి.వి.దుర్గా ప్రసాద్, ఎం.రమేష్ నాయుడు, బలివాడ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

బాబు అరెస్టు కక్ష సాధింపు కాదు

- చట్టం తన పని తాను చేసుకుపోతుంది
- పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్



సంతోష్‌నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం : చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు చర్య కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు సంతోషినగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిజానికి కక్ష సాధింపు అంటే జగన్‌పై చంద్రబాబు అండ్ గ్యాంగ్ చేసినదే అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై అబద్ధపు కేసులు పెట్టి కాంగ్రెస్‌తో కుమ్మక్కయి అక్రమంగా అరెస్టు చేయించారని దుయ్యబట్టారు. అప్పటి వీడియోల సాక్ష్యాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా అన్ని ఇళ్లకు వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా సరిగా లేదని, రోజూ ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు ఆయన ముందు వాపోయారు. దీనికి స్పందించిన ఆనంద్‌కుమార్ మంచినీటి సరఫరా అధికారులతో మాట్లాడి సమస్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఇక్కడ రిజర్వాయర్ కనెక్షన్ సరిగ్గా లేదని, పైప్‌లైన్లు పాతవి అని అధికారులు తెలిపారు. ఆ పైప్‌లైన్లను మార్చాలని మంచినీటి సరఫరా విభాగం అధికారులు వివరించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని ఆనంద్‌కుమార్ స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో సుమారు 300 ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడి, ప్రజల సొమ్ము కాజేసిన నాయకుడిని చట్టపరంగా అరెస్టు చేశారన్నారు. కక్ష సాధించేందుకు అరెస్టు చేయడం జగన్‌మోహన్‌రెడ్డికి అలవాటు లేదన్నారు.

ప్యాకేజీ బట్టే యాక్షన్..

బాబు ప్యాకేజీని బట్టే పవన్ కల్యాణ్ యాక్షన్ ఉంటుందని, బాబు అరెస్టు గురించి తెలియగానే దత్తపుత్రుడు బయలుదేరారని ఆనంద్ ఎద్దేవా చేశారు. అయితే శాంతి భద్రతల నేపథ్యంలో పవన్‌ను రావొద్దని పోలీసులు చెప్పినా వినలేదన్నారు. రోడ్డు మార్గాన వచ్చిన పవన్ కల్యాణ్ ప్యాకేజీ ఎక్కువ వస్తుందని ఆ రోడ్డు మీదే దొర్లి, కారెక్కి ఓవరాక్షన్ చేశారని దుయ్యబట్టారు. నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, స్థానిక నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ, మళ్ల శ్రీనివాసరావు, షేక్ రెహమాన్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



63వ వార్డులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింధియా : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని 63వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సోమాదుల సురేష్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ శంకుస్థాపన చేసిన డ్రైనేజీ, కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు, సామాజిక భవనం ఏర్పాటు, తాగునీరు, వీధి దీపాలు వంటి పలు అభివృద్ధి పనులను జీవీఎంసీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వార్డును అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం పర్యటనలు చేస్తామన్నారు. తద్వారా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో రమణమూర్తి, గౌరీశ్వరరావు, రాంబాబు, రమణ, జీవీఎంసీ అధికారులు, కాంట్రాక్టర్ చిట్టి గణపతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందిస్తున్న సంస్థ సభ్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ప్రాంతంలో జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విశాఖ ఫ్రైడ్ చాప్టర్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. జేసీఐ వీక్ జైత్రలో భాగంగా సుమారు 200 మంది అనాథలకు ఆహార పొట్లాలు అందజేసినట్లు సంస్థ ప్రతినిధి కటకం చందు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.శోభన్‌బాబు, పీఎస్‌వీ ప్రదీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఆహారం ప్యాకెట్ల పంపిణీ

మహారాణిపేట : జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వైజాగ్ ఎక్సలెన్సీ సభ్యులు మంగళవారం ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులకు ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుమారు 500 మంది రోగులు, వారి బంధువులకు ఈ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ కోఆర్డినేటర్ షబ్బం, వీక్ కో ఆర్డినేటర్ ఫణి కళ్యాణ్, సాయి రాహుల్, మోహని, భార్గవి ప్రియ, హిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ చైతన్యానికి కృషి అవసరం

- రెక్టార్ ఆచార్య కె.సమత
- ఏయూలో ఐడీఆర్‌సీ తరగతుల ప్రారంభం



మాట్లాడుతున్న రెక్టార్ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంచే దిశగా అధ్యాపకులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఏయూ హెచ్ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్రంపై పునశ్చరణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న నూతన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. సృజనాత్మకత, సహనం, కమ్యూనికేషన్ స్కిల్స్, కాల నిర్వహణ, కాలానుగుణంగా మార్పులను ఆకళింపు చేసుకోవడం వంటి లక్షణాలను అధ్యాపకులు అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ మార్పులు పెను సవాళ్లను విసురుతున్నాయన్నారు. ఊహించని విధంగా వరదలు రావడం, ప్రత్యామ్నాయ ఇంధనాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. వాయు కాలుష్యం కారణంగా లక్షలాది మంది ప్రతి సంవత్సరం మృత్యువాత పడుతున్నారన్నారు. అనేక పర్యావరణ సంబంధ సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నారు. యువతను తీర్చిదిద్దడంలో అధ్యాపకునికి సహనమే అతిపెద్ద ఆయుధంగా నిలుస్తుందన్నారు. ఏయూ హెచ్ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వెంకటకృష్ణ మాట్లాడుతూ విభిన్న జీవులతో సమన్వయం చేసుకుంటూ సాగడం మానవ జీవన విధానమన్నారు. వైవిధ్య అంశాలు, శాస్త్రాల సమ్మేళనంగా పర్యావరణ శాస్త్రం నిలుస్తుందన్నారు. సహజ వనరుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ మార్పులపై అవగాహన, విపత్తులు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఇ.ఉదయ భాస్కరరెడ్డి, ఆచార్య ఎన్.ఎ.డి. పాల్, తదితరులు పాల్గొన్నారు.

16న లలితాపీఠంలో అష్టావధానం

సీతంపేట: లలితానగర్ శ్రీలలితాపీఠంలో ఈ నెల 16, 17 తేదీల్లో కవితా మహేంద్రజాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు అష్టావధానం జరుగుతుందని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ సంచాలకులుగా, శతావధాని బులుసు అపర్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారని తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు తెలుగు విజయం సాహితీ రూపకం ప్రదర్శించబడుతుందన్నారు. ఇందులో పాత్రధారులు నన్నయగా కడిమిళ్ల వరప్రసాద్, పురాణకవిగా గొర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రబంధకవిగా అబ్బిరెడ్డి పేరయ్యనాయుడు, శతకకవి పి.రామచంద్రరావు, అవధాన కవి బులుసు అపర్ణ, నాటక కవి సి.వి.వి.సత్యనారాయణమూర్తి పాల్గొంటారని తెలిపారు. రెండు రోజులు సాహిత్య కార్యక్రమాలూ పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరుగుతాయన్నారు.